మార్కెట్ యూనియన్ ఉపాధ్యక్షునిగా చిన్నారావు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేశ్వరం నగర పంచాయతీ మార్కెట్ కార్మికుల సంఘం ఉపాధ్యక్ష, కార్యదర్శులుగా శిడగం చిన్నారావు, తాండ్రోజు సత్తిబాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వీరిని యూనియన్ అధ్యక్షుడు, వార్డ్ కౌన్సిలర్ మూది నారాయణస్వామి పూలమాల వేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు గెద్ద రాము, కంచి బోయిన నాగేశ్వరరావు, కంది సత్తిబాబు, గొల్లపల్లి బాబూరావు, నోమ్ము రాజు, కోన చందర్రావు ఉన్నారు.

కార్యవర్గాన్ని అభినందిస్తున్న కౌన్సిలర్

సమస్యల వలయంలో ఆర్‌టిసి సిబ్బంది

- ప్రభుత్వోద్యోగులుగా మారినా ప్రయోజనం సున్నా
- ఉద్యోగులకు గొడ్డలిపెట్టుగా జిఒ 70

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వ ఉద్యోగులుగా మారిన తర్వాత తమకు భవిష్యత్తులో ఎంతో మేలు జరుగుతుందని ఆశించినా ప్రయోజనం ఏమీ లేదని ఎపిఎస్ ఆర్టీసీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విడుదలైన ప్రభుత్వ ఉత్తర్వులు, సంస్థ అమలు జరుపుతున్న విధానాలు ఉద్యోగులకు తీవ్ర నష్టం కలుగజేసే విధంగా ఉన్నాయని చెబుతున్నారు. ఎదుర్కొంటున్న సమస్యలపై ఇటీవల ఆర్టీసీ ఉద్యోగులు అన్ని డిపోల వద్ద ఆందోళనలు నిర్వహించారు. అనంతరం ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

కాకినాడ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లో డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్, ఆఫీసు సిబ్బంది, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు సుమారు 5 వేల మంది పని చేస్తున్నారు. అయితే వీరందరినీ ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తిస్తూ వైసిపి సర్కార్ నిర్ణయం తీసుకుంది. దీంతో ఉద్యోగులంతా ఎంతో సంతోషించారు. ఇకనుంచి పరిస్థితులు మారతాయని, అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఆశించారు. కానీ తీరా ప్రభుత్వ తీరు చూస్తుంటే ప్రయోజనాల కంటే సమస్యలు ఎక్కువయ్యాయని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పెన్షన్ ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగానికి భద్రత లేకుండా పోయింది. కారుణ్య నియామకాలు కూడా చేపట్టడం లేదు. మెడికల్ అన్‌ఫిట్ అయిన వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదు. 2017 నుంచి రావాల్సిన పే స్కేలు ఏరియర్స్ నేటికీ చెల్లించలేదు. కార్మికులంతా కష్టపడి ఏర్పాటు చేసుకున్న ఎస్ఆర్బిఎస్, ఎస్‌బిటి స్కీములను రద్దు చేసినా ఆ డబ్బు ప్రభుత్వం నేటికీ ఉద్యోగులకు అందించలేకపోయింది. నాలుగేళ్లుగా లీవ్ ఎన్‌కాష్‌మెంట్ కూడా ఇవ్వలేదు. శాస్త్రీయమైన సర్వే లేకుండానే క్యాడర్ స్ట్రెంత్ పేరుతో ప్రభుత్వం జారీ చేస్తున్న అక్రమ బదిలీ ఉత్తర్వుల వలన కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు. అర్హులైన వారికి స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లను సకాలంలో ఇవ్వడం లేదు. ఎరియర్స్, మెడికల్ బిల్లుల మంజూరు విషయాల్లో ట్రెజరీ ఉద్యోగులకు లంచాలు ఇస్తేనే గానీ పని పూర్తి చేయడం లేదు. ఇలా అనేక సమస్యలతో తీవ్రస్థాయిలో సతమతమవుతున్నా ప్రభుత్వం తమను కనీసం పట్టించుకోవడం లేదని ఆర్టీసీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిఒ నెంబర్ 70తో ఎన్నో ఇబ్బందులు

ఈ ఏడాది జూలై 25న ప్రభుత్వం ఇచ్చిన జిఒ 70 తమ ఉపాధికి నష్టం చేకూర్చేలా ఉందని కార్మికులు తీవ్ర ఆవేదన వెలిబుచ్చుతున్నారు. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులకు 34 వరకూ మిస్ కండక్ట్ (ఉద్యోగులు చేయకూడని పనులు) ఉంటాయి. అంటే విధి నిర్వహణలో అలసత్వం వహించడం, ప్రయాణికులు టిక్కెట్ తీసుకోకపోయినా, ఏ రూపంలోనైనా నిరసన తెలియజేయడం, అక్రమంగా ఆర్‌టిసి ఆస్తులను దుర్వినియోగ పరచడం వంటివి మిస్ కండక్ట్ పరిధిలోకి వస్తాయి. అయితే ఈ జిఒ ద్వారా కొన్ని సవరణలు చేస్తూ రూల్ 26ఎ ద్వారా 54 చర్యలను మిస్ కాండక్ట్ చర్యలుగా జతపరిచారు. ఈ సవరణలోని అంశాలు రాజ్యాంగ విరుద్ధంగా, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి. చిన్నపాటి తప్పులకు, పొరపాట్లకు కూడా తీవ్రమైన శిక్షలకు, సస్పెన్షన్లకు, రిమూవల్స్‌కు గురి చేసే విధంగా ఉన్నాయని ఇది సరికాదని చెబుతున్నారు. కావున జిఒను తక్షణమే సవరించి ఉపాధికి భంగంగా ఉన్న క్లాజులలో మార్పులు చేయాలని కోరుతున్నారు. గతంలో ఉద్యోగులను ఏ కారణం చేతనైనా డిపో మేనేజర్ సస్పెండ్ చేస్తే డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్, రీజినల్ మేనేజర్ (ఆర్ఎమ్), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడి) ఇలా మూడు అంచెలలో అప్పీల్ చేసుకునే అవకాశం ఉండేది. కానీ జిఒ 71 ద్వారా అప్పిలేట్ దొంతరను రెండు అంచెలకు మాత్రమే అవకాశం ఇచ్చారు. గతం నుంచి పెండింగ్‌లో ఉన్న అనేక అప్పీళ్లను పరిష్కరించకపోవడంతో రెండేళ్లుగా సస్పెండ్ అయిన ఉద్యోగులకు ఎదురు చూపులే మిగిలాయి. వారి కుటుంబాలు ఆకలి కేకలు వేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇలా అనేక సమస్యల నడుమ విధులు నిర్వర్తిస్తున్నామని ఆర్‌టిసిఉద్యోగులు తీవ్ర ఆవేదన వెలిబుచ్చుతున్నారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆర్‌టిసి డిపో వద్ద ఆందోళన చేస్తోన్న ఉద్యోగులు (ఫైల్)

సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ప్రజాస్వామ్యంపై బిజెపి దాడి : సిపిఎం

ప్రజాశక్తి-కాకినాడ

దేశంలో ప్రజాస్వామ్యంపై బిజెపి దాడి చేస్తోందని దానికి వైసిపి, టిడిపి, జనసేన వంతపాడుతున్నాయని సిపిఎం కాకినాడ జిల్లా కార్యదర్శి ఎం.రాజశేఖర్ విమర్శించారు. ఆదివారం సిపిఎం జిల్లా విస్తత సమావేశం కాకినాడ సుందరయ్య భవన్‌లో కెఎస్.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహిరంచారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛపై బిజెపి దాడి పెరిగిపోయిందన్నారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఎవరైనా వార్తలు రాస్తే వారిపైన ఇడి దాడులు పెరిగిపోతున్నాయన్నారు. న్యూస్ క్లిక్ పైన దాడి చేయడం ఈ కోణంలోదేనని అన్నారు. రాష్ట్రాల హక్కులను బిజెపి హరించేస్తున్నా రాష్ట్రంలో ఉన్న మూడు పార్టీలు పట్టించుకోకుండా బిజెపితో దోస్తీ చేస్తున్నాయన్నారు. ప్రత్యామ్నాయ ప్రజా రాజకీయ విధానాన్ని రూపొందించాల్సిన భాధ్యత కమ్యూనిస్టులపై ఉందని తెలిపారు. సిపిఎం రాష్ట్రవ్యాప్తంగా అన్ని రంగాలలోనూ తన రాజకీయ విధానాన్ని తెలుపుతూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యామ్నాయ రాజకీయంపై రాష్ట్రవ్యాపితంగా ప్రచారం నిర్వహిస్తున్నామని జిల్లాలో అన్ని మండలాల్లోనూ యాత్రలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో కరణం ప్రసాదరావు, జి.బేబిరాణి, టేకుమూడి ఈశ్వరరావు, నీలపాల సూరిబాబు, సిహెచ్.రాజ్‌కుమార్, వి.రాజుబాబు, కె.సింహాచలం పాల్గొన్నారు.

200 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి -కరప

కాకినాడ రూరల్ ఉప్పలంకలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరంలో కంటి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. 200 మందికి పైగా గ్రామస్తులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. లయన్స క్లబ్ కాకినాడ గోల్డెన్ జూబ్లీ , బాదం బాలకృష్ణ క్లాత్ అండ్ ఐ గ్లాస్ ప్రాజెక్ట్, రావుల వెంకన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరంలో డాక్టర్ బాదం బాలకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు అందజేస్తామని, కంటి ఆపరేషన్ నిర్వహిస్తారని తెలిపారు. 19 మందికి ఉచితంగా కాట్రాక్ట్ ఆపరేషన్లకు,105 మందికి కళ్ళజోళ్లు అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ గుప్తా, ప్రాజెక్ట్ చైర్మన్ వివి.రమణ, జె.ప్రకాష్, లొల్ల దుర్గాప్రసాద్, వడకట్టు మణికుమార్ పాల్గొన్నారు.

శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆనందోత్సాహాలతో బాలమందిరం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

మాధవపట్నం జమునా నగర్ కాలనీలో అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలమందిరం కార్యక్రమాలు ఆదివారం బాలల ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. చిట్టి ఊహలు పత్రిక రూపకల్పన కార్యశాలలో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. కథలు, బొమ్మలు, సామెతలు, వ్యాసాలు, గేయాలు వంటి అంశాలతో, రచనలతో రూపకల్పన చేశారు. పి.వీరబాబు విద్యార్థులకు ఒరిగామి, డ్రాయింగ్ అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులు తమ సృజనాత్మకత జోడించి, ఫ్లవర్ వాజ్ వంటి, కళాకతులను కాగితంతో తయారు చేశారు. కంప్యూటర్ శిక్షణ తరగతులు ఎం.విస్సు అందజేశారు. విద్యార్థులు బాలమందిరంలోని చిల్డ్రన్ లైబ్రరీలో బాలసాహిత్యం పఠనం, సమీక్షలు చేశారు. స్టూడెంట్ మెంటార్స్ హేమంత్, విస్సు పాల్గొన్నారు. ఈ నెల 14, 15 తేదీలలో బాలమందిరం విద్యార్థులకు దసరా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అంగర గోపాలకష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల మందిరం విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్న టీచర్

ప్రజల భాగస్వామ్యంతోనే వన్యప్రాణుల రక్షణ

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రజల భాగస్వామ్యం ద్వారానే వన్యప్రాణుల రక్షణ సాధ్యమవుతుందని కాకినాడ జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.భరణి అన్నారు. ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు జరిగిన వన్యప్రాణి వారోత్సవాల ముగింపు సందర్భంగా కోరంగి బయో డైవర్సిటీ కేంద్రం వద్ద సభలో ఆమె మాట్లాడారు. వారం రోజులపాటు ప్రజలకు, విద్యార్థులకు వన్యప్రాణుల గురించి పలు విషయాలు అవగాహన కలిగించినట్టు తెలిపారు. అంతకుముందు విలేకరుల సమావేశంలో ప్రత్యేకంగా ఆమె మాట్లాడారు. జీవ వైవిధ్యం పట్ల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించడంతోపాటు, కెరీర్ గైడెన్స్‌పై అల్లూరి సీతారామరాజ జిల్లా రంపచోడవరం అటవీ శాఖ అధికారి జిజి.నరేంద్రన్‌తో శిక్షణ ఇప్పించినట్టు తెలిపారు. కోస్తా ప్రాంతంలోని మత్స్యకారులకు ఏ విధమైన మత్స్య ఉత్పత్తులు పట్టుకోకూడదు అనే వాటిపైన అవగాహన కలిగించినట్లు తెలిపారు. మడ అడవుల ప్రాంతాల్లో ఉండే పక్షి జాతులను సంరక్షించాలని భైరవపాలెం వద్ద అరుదుగా కనిపించే ఇండియన్స్ స్కిమ్మర్ పక్షులను వారికి చూపించినట్టు తెలిపారు. మడ అడవులను నరకవద్దని, జీవవైవిధ్యాన్ని కాపాడాలని వంటి విషయాల పట్ల ప్రజలను భాగస్వాములను చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం జిల్లాలోని 8 పాఠశాలలకు చెందిన సుమారు వందమంది విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.భరణి, కోరంగి ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్.వరప్రసాద్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఒ నాగార్జున, వీరభద్రరావు, ఎఫ్‌బిఒలు ధనుంజయ్, మరో ఆరుగురు పాల్గొన్నారు.

పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

సీనియర్ రాజకీయ నేత వెంకట్రావు మృతి

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలోని యల్లమిల్లి గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు పోకల వెంకట్రావు ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఆయన భౌతిక కాయానికి ఎంపిపి చలగళ్ల దొరబాబు జెడ్‌పిటిసి సభ్యుడు పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు, వైస్ ఎంపిపి కుంచే రాజా, కందుల చిట్టిబాబు నివాళులర్పించారు. అనంతరం ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు ఫోన్ ద్వారా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వెంకట్రావు తొలుత కాంగ్రెస్ పార్టీలో 1994లో ఎంపిటిసిగా గెలుపొందారు. 2000లో సర్పంచ్‌గా పని చేశారు. ప్రస్తుతం వైసిపిలో ఉన్నారు.

చంద్రబాబుకు సంఘీభావంగా దీక్షలు

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్, రిమాండ్‌ను నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యాన చేపట్టిన నిరసనలు, దీక్షలు ఆదివారం కొనసాగాయి.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ సిఎం వైఎస్.జగన్ ప్రభుత్వంలో రాష్ట్రంలో న్యాయం అంధకారంలోకి అధికారాన్ని అడ్డుపెట్టుకుని వ్యవస్థలను మేనేజ్ చేస్తూ కుట్రలు పన్నుతున్నారని కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు 26వ రోజు బాబుకు తోడుగా మేము అంటూ స్వర్ణకారుల సంఘ కార్మికులు, మెరైన్ లేత్ వర్క్స్ అసోసియేషన్, శ్రీ భగీరథ సగర సంఘం, షీట్ మెటల్ వర్క్స్ అసోసియేషన్ సభ్యులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. చెల్లుబోయిన శ్రీనివాస్ రావు, గ్రంధి నారాయణరావు పాల్గొని దీక్ష పరులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ధోనాద్రి అబ్రహాం, తల్లిబోయిన రాముడు, జక్కి విజయ్ కుమార్, సన్నిపోయిన ఏసేపు, నక్కా సుబ్బారావు, జక్కి సత్యనారాయణ, తంగేళ్ల లోవరాజు, గంట సత్యనారాయణ పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** మండలం సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో టిడిపి శ్రేణులతో కలిసి మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారయణ మూర్తి జలదీక్ష చేపట్టారు. తొలుత వలసపాకల సెంటర్‌లో బాబుతో నేను 25వ రోజు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. 2024లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, ఆయన జైలు నుంచి విడుదల అవ్వాలని రణస్థలం మాజీ సర్పంచ్ వారి మిత్రులు శ్రీకాకుళం నుంచి కుప్పం వరకూ చేపట్టిన సైకిల్ యాత్ర కాకినాడ రూరల్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్ష శిబిరానికి చేరుకుంది. పిల్లి దంపతులు సైకిల్ యాత్రికులను అభినందిచారు. **తాళ్లరేవు** 'బాబు తో నేను' కరపత్రాలను తాళ్ళరేవు పంచాయతీ బైపాస్ కోలనీ, మాధవరాయుడు పేటలో ఇంటి ఇంటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ (బాబి), క్లస్టర్ ఇన్‌ఛార్జి మందాల గంగ సూర్యనారాయణ, నడింపల్లి వినోద్, రోళ్ల చక్రవర్తి, బండారు శ్రీను, హేమలత, వాడ్రేవు వీరబాబు, టేకుమూడి లక్ష్మణరావు, మాజీ ఎంపిటిసి సత్తిబాబు, దుర్గా ప్రసాద్, గోవిందు, శేఖర్, రమేష్, భాస్కర్, హేమసుందర రావు పాల్గొన్నారు. **ప్రతిపాడు**లో 27వ రోజున మహిళలు నిరసన దీక్షలో పాల్గొన్నారు. నియోజకవర్గ నాలుమూలల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలకు టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల సత్యప్రభ నల్ల కండువాలు వేశారు. **తుని** నియోజకవర్గం నేత యనమల రాజేశ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆదివారం సంఘీభావ పాదయాత్ర చేపట్టారు. అన్నవరం గ్రామం నుంచి ఘాట్ రోడ్డు గుండా పాదయాత్ర చేస్తూ సత్యదేవుని సన్నిధికి తరలివెళ్లారు. అనంతరం సత్యదేవుని దర్శించుకుని బాబుకి అక్రమ కేసుల నుండి బయటపడి బెయిల్ రావాలని పూజలు చేశారు. చంద్రబాబు నాయుడుతోనే తామంతా ఉన్నామని నాయకులు, కార్యకర్తలు ప్రతినబూనారు. **పెదపూడి** చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మండలంలో చింతపల్లిలో మాజీ ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు, జనసేన నాయకులు కాగడాల ర్యాలీ చేపట్టారు. కాగడాలు పట్టుకుని బాబుతో నేను వియ్ వాంట్ జస్టిస్ నినాదాలు చేస్తూ గ్రామంలో పాదయాత్ర చేశారు. జనసేన నాయకుడు రావాడ నాగు, టిడిపి నాయకులు, తమలపూడి శివరామరెడ్డి, జుత్తిక కృష్ణ, పలివెల బుజ్జి, గంట రాజు, జనసేన నాయకులు తదితరులు,పాల్గొన్నారు.

కాకినాడ రూరల్‌లో..

తునిలో..

కార్టూ'నిజం'

బూరుగుపూడిలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

కిర్లంపూడి మండలం బూరుగుపూడిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌విఎస్.అప్పలరాజు ఆధ్వర్యంలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ మహిళల చైతన్య రథయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రథయాత్ర కమిటీ దాపర్తి సీతారామయ్య, కంచుమర్తి రాఘవ హాజరై గ్రామంలో మహిళలతో ఇంటింటికీ తిరిగి టిడిపి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోందన్నారు. అందుకే చంద్రబాబుకు లోకేష్‌కు జనాదరణ విపరీతంగా పెరిగి టిడిపి సభలకు లక్షలాదిగా జనం రావడంతో చంద్రబాబును లోకేష్‌ను ఏదో విధంగా అడ్డుకోవాలని అక్రమ కేసులు పెట్టి చంద్రబాబును జైలుకు పంపారన్నారు. చంద్రబాబు త్వరలోనే బయటకు వస్తారని రాబోయే రోజుల్లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500, తల్లికి వందనం కింద చదువుకునే పిల్లలు అందరికి సంవత్సరానికి రూ.15000లు, దీపం పథకం కింద సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, జిల్లా పరిధిలో బస్సు ప్రయాణం ఉచితం తదితర సంక్షేమ పథకాలు తెలుగుదేశం పార్టీ అధికారం వచ్చిన మొదటి వంద రోజుల్లోనే ప్రవేశపెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీరంరెడ్డి కాశిబాబు, కొత్త కొండబాబు, కుంచే తాతాజీ, పాఠంశెట్టి రవి, కుంచే సుబ్బలక్ష్మి, పోలినాటి ధర్మానందకుమారి, గుమ్మళ్ల అనంతలక్ష్మి, గొల్లవిల్లి శ్రీదేవి, తిప్పన సత్యవతి, ఎల్లాటి అమ్మాజీ, పాఠంశెట్టి వెంకటలక్ష్మి, చెక్క మరియా, గెద్దాడ సత్యవేణి, గుండుపల్లి సుజాత, గొల్లవిల్లి వరలక్ష్మి పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

సమావేశంలో పాల్గొన్న సభ్యులు

15 నుంచి శరన్నవరాత్రులు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పెదబ్రహ్మాదేవంలోని శ్రీ శారద రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో 64వ శరన్నవరాత్రి మహోత్సావాలు 15వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ జరపనున్నట్లు శ్రీ శారద రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్, సభ్యుడు నువ్వుల బాబ్జీ, నువ్వుల సూర్య చంద్రరావు, తేలుగుంట్ల నరసింహారావు, నామాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



చంటిబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న రఘురామ్

ఘనంగా ఎంఎల్ఎ చంటి బాబు పుట్టిన రోజు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు 45వ పుట్టిన రోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఇర్రిపాకలో తన స్వగృహంలో ఆదివారం ఉదయం నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య భారీ కేక్‌ను కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు ఒమ్మి రఘురాం తన అనుచరులతో కలిసి చంటిబాబుకు పూల దండలు వేసి శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంఎల్ఎ చంటి బాబు మాట్లాడుతూ తన పుట్టిన రోజు సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చి తన కు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఇళ్ల అప్పారావు కాపు, జనపరెడ్డి బాబు, తోట రవి, భూపాలపట్నం ప్రసాద్ ఉన్నారు.

నేరాలు ఘోరాలు

కోడి పందేలపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని వెదుళ్ళకుంటలో నిర్వహిస్తున్న కోడిపందాలపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో రెండు కోడి పుంజులను, రూ.10,300లను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కోడిపందాలు, పేకాట, జూదం వంటి అసాంఘీక కార్యకలాపాలు నిర్వహిస్తే సహించేది లేదన్నారు.

పురుగుల మందు తాగిన మహిళ మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

భర్త మందలించాడని మనస్థాపం చెంది పురుగుల మందు తాగిన మహిళ రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల వివరాలు ప్రకారం.. పేరవరం గ్రామానికి చెందిన సలాది బేబీ పార్వతి(27) ఇటీవల కాలంలో భార్యాభర్తలు ఇరువురికి చిన్న చిన్న మనస్పర్థలు రావడంతో మనస్థాపాన్ని గురై ఈనెల 6వ తేదీన పురుగుల మందు తాగింది. వాంతులు చేసుకోవడంతో. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందింది. దీనిపై ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - అమలాపురం

యానాంకు చెందిన బొడ్డు కామేశ్వర రావు అనే వ్యక్తి ఆదివారం యానం నుంచి మద్యాన్ని తరలిస్తుండగా సెబ్ ఎస్ఐ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతని నుంచి 160 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రెడ్డి తెలిపారు.

సారా బట్టీలపై దాడులు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని కోనవపేట శివారులో సారా బట్టీలపై కొత్తపల్లి ఎస్ఐ స్వామి నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు. సారా తయారీదారుడు పరారయ్యాడని, అతనిపై కేసు నమోదు చేసి నిందితుడు కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బహుజన సమాజ్ పార్టీతోనే రాజ్యాధికారం సాధ్యం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ప్రతి ఒక్కరికీ రాజ్యాధికారం బహుజన సమాజ్ పార్టీతోనే సాధ్యపడుతుందని ఆ పార్టీ జిల్లా నాయకులు సాకా రాజారావు అన్నారు ఆయన ఆదివారం వెలిచేరులో బాలయోగి కాలనీలో జైభీమ్ అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు గుర్రపు కొత్తియ్య అధ్యక్షతన సమావేశం జరిగింది జిల్లా నాయకులు రాజారావు మాట్లాడుతూ ఓటు హక్కు గురించి, రాజ్యాధికారం గురించి,ఓటు శాతం గురించి తెలియజేశారు.. వెలిచేరు ప్రజలు మనకు రాజ్యాధికారం కావాలి అనే ఆలోచనతో బహుజన పార్టీలో30 మంది చేరారు ఇసుకపాటి సర్వేశ్వరరావు, అంబటి విజయకుమార్, టి.సత్యనారాయణ, బొంత వెంకట్రావు, సాలి శ్రీను, గౌసంగి నరేష్, టి.బాలాజీ, ఇసుకపాటి మహేష్, సాలి బాలాజీ తదితరులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరిన బహుజన రాజ్యాధికారం కోసం ప్రయత్నాలు చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గ్రామ పెద్దలు,మహిళలు, యువత పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

క్రియేటివ్ ఆర్ట్స్-అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ నిర్వాహణ లో సంస్కార భారతి ఆధ్వర్యంలో వందే వేద భారతం రాష్ట్ర స్థాయి చిత్రకళా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బహుమతి ప్రదాన సభ సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు ఆకొండి పవన్ కుమార్ అధ్యక్షతన ఆదివారం స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సమనస బ్రాంచి లో నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రముఖ చిత్రకారుడు, ఏలూరు కు చెందిన చిత్రాలయ అధినేత ఎమ్.రాంబాబును క్రియేటివ్ ఆర్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు అంజి ఆకొండి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన విజేతలైన చిత్రకారులకు ముఖ్య అతిథులచే బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్.మను విహార్, వివి వి.సుబ్రహ్మణ్యం, యు. ఆశీర్వాదమ్, కార్టూనిస్ట్ మాడా రాము తదితరులు పాల్గొన్నారు.

చల్లమ్మ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం

ప్రజాశక్తి-మామిడికుదురు

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రామాయణం చల్లమ్మ దంపతులకు గోగనమఠం యుపి స్కూల్ నందు ఆదివారం పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. హెచ్ఎమ్. బావి సెట్టి నాగశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమం లో ఎంపిపి కుసుమ వనజకుమారి, జెడ్‌పిటిసి సభ్యుడు కె.అంజిబాబు, సర్పంచ్ అల్లు విజయలక్ష్మి, వైస్ ఎంపిపి భూపతిరాజు లక్ష్మీ సుబ్రహ్మణ్యం, పి. ఎసిఎస్ ఛైర్మన్ సాగి పిఆర్‌విఎస్ఎస్.నర్సింహవర్మ, భూపతిరాజు సత్తిబాబు రాజు, ఎమ్ఇఒ-1 లక్ష్మీనారాయణ, ఎమ్ఇఒ-2. మోకా వెంకన్నబాబు, పిఎమ్‌సి ఛైర్మన్ వి. సూరిబాబు, మగటపల్లి హైస్కూల్ హెచ్ఎమ్ కె. హనుమంతరావు, లూటుకురు హెచ్ఎమ్ జి.నాగ ప్రసాద్ తదితరులు పాలుగున్నారు.

రోగులకు మెరుగైన వైద్యమందేలా ఒపి

ఐసిడిఎస్ పీడీ జివి.సత్యవాణి

ముఖాముఖి

ప్రజాశక్తి-అమలాపురం

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో స్త్రీ, శిశు సంక్షేమానికి ప్రత్యేక కృషి జరుపుతున్నామని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన పౌష్టికాహారం అందించి, వారిని ఆరోగ్యంగా ఉంచాలన్నదే ప్రభుత్వ ఆశయమని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జివి.సత్యవాణి తెలిపారు. దీనిలో భాగంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో కోడిగుడ్లు, పాలు వంటి పౌష్టికాహారాన్ని చిన్నారులకు అందిస్తున్నామన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె పలు విషయాలను వెల్లడించారు.

జిల్లాలో ఎన్ని కేంద్రాలున్నాయి.

జిల్లాలో 7 ప్రాజెక్టుల పరిధిలో 1,726 మెయిన్, మినీ అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. వీటిలో 70 శాతం సొంత భవనాలుండగా మిగిలినవి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటిలో 14,814 మంది పిల్లలు, 9,293 మంది గర్భిణులు, 8,538 మంది బాలింతలు ఉన్నారు.

కేంద్రాల్లో అందిస్తున్న సేవలు ఏమిటి.

గర్భిణులు, బాలింతలకు వేరుశనగ అచ్చులు, రాగి పిండి, బెల్లం తదితర వస్తువులను పంపిణీ చేస్తున్నాం. కేంద్రంలో నమోదైన ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులకు బాలామృతం అందిస్తున్నాం. గర్భిణులకు సీమంతాలు నిర్వహించడం, పిల్లలకు అన్నప్రాసక చేయించడం, పోషణ వేడుకలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేసాం. లబ్ధిదారులు, చిన్నారులు క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పోషకాహారాన్ని తీసుకోవాలని చైతన్యం చేయడమే వీటి ముఖ్య ఉద్దేశ్యం.

ఖాళీలను ఎప్పుడు భర్తీ చేస్తారు.

జిల్లాలో వర్కర్ పోస్టులు, మినీ అంగన్వాడీ పోస్టులు ఖాళీలుండగా వాటి భర్తీకి ఇప్పటికే చర్యలు తీసుకున్నాం. జిల్లాల విభజన తర్వాత సూపర్‌వైజర్ల కొరత వల్ల పర్యవేక్షణకు కొంత ఇబ్బంది ఉంది. పర్యవేక్షణలో సమస్యలు లేకుండా ఉన్న వారికే ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించాం. వారు తమకు నిర్దేశించిన స్థాయిలో ఈ కేంద్రాలను తనిఖీ చేసి పర్యవేక్షణను సమర్థంగా కొనసాగించేలా ఎప్పటి కప్పుడు సమీక్షిస్తున్నాం.

కేంద్రాల తనిఖీలు ఎలా జరుగుతున్నాయి.

అన్ని ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎప్పటికప్పుడు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాం. సరుకులు, లబ్ధిదారుల వివరాలు యాప్‌లో నమోదు చేయాలి. సరుకు నాణ్యత విషయంలో రాజీ పడడం లేదు. సమయపాలన పాటించడం లేదు, మా దృష్టికి వచ్చిన చోట ఆవగాహన కల్పిస్తున్నాం. నెలనెలా నిర్వహించే సమావేశంలోనూ హెచ్చరిస్తున్నాం. పిల్లల గ్రోత్ పెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

అర్హులందరికీ లబ్ధి చేకూర్చేలా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీకి వెళ్లినప్పుడు ఆ కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులను విచారిస్తున్నాం. ఎవరికైనా అందలేదని తెలిస్తే తగిన చర్యలు తీసుకుంటాం. చాలా చోట్ల పౌష్టికాహారాన్ని ఇంటికి ఇవ్వాలని అడుగుతున్నారు. ఇది సరైంది కాదు. లబ్ధిదారులు కూడా సహకరించాలి. అర్హులందరూ లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంటున్నాం. పిల్లలు, బాలింతలు, గర్భిణీల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాం.

చిన్నారుల విద్యాభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం మాత్రమే పెడతారన్న భావనలో తల్లిదండ్రులు ఉన్నారు. దీంతో వారు పిల్లలను ఆ సమయానికి పంపడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. అక్కడ పూర్వ ప్రాథమిక విద్యాబోధన ఉందనే విషయాన్ని వారు గుర్తించేలా మా కార్యకర్తలతో క్షేత్రస్థాయిలో ప్రచారం చేయిస్తున్నాం. దీని ద్వారా పిల్లల హాజరును పెంచడానికి చర్యలు చేపడతాం. ఆట, పాటలతో ఒత్తిడి లేకుండా పాఠాలు చెప్తూ వారిలో శారీరక, మానసిక అభివృద్ధికి వారికి తగిన జ్ఞానాన్ని పెంపొందిస్తున్నాం.

అద్దె కేంద్రాల్లో సౌకర్యాలు ఎలా ఉంటున్నాయి.

అద్దె భవనాలకు ఇచ్చే అద్దె కూడా పెరిగింది. వాటిలో సౌకర్యాలు మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నాం. వాటిలో తప్పకుండా విద్యుత్, నీరు, మరుగుదొడ్ల సదుపాయం ఉండాలి. అవి లేని భవనాలు ఉంటే వాటిని మార్చుకునేలా కూడా ఆ కేంద్రాల కార్యకర్తలకు సూచిస్తాం.

బాధిత కుటుంబానికి రూ.3 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్

ప్రజాశక్తి - చాగల్లు

మీనానగరం గ్రామం పాతపేటకు చెందిన కొక్కిరిపాటి రాజేష్ తండ్రి భాస్కరరావుకు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.3 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్‌ను హోంమంత్రి తానేటి వనిత అందజేశారు. బాధితుడు రాజేష్ తన రెండు తుంటులు సరిగా పనిచేయక పోవడంతో నడవలేని స్థితిలో గత ఆరేళ్లగా బాధపడుతున్నాడు.

ఆయన భాస్కరరావు కొడుకు దీనస్థితిని హోంమంత్రి తానేటి వనిత దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి సిఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.3లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్‌ను అందించి అండగా నిలిచారు. ఈ సాయంతో రాజేష్ మెరుగైన ఆరోగ్యంతో మంచి జీవ నాన్ని పొందాలని హోంమంత్రి ఆకాంక్షించారు. పంగిడిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లెటర్ ఆఫ్ క్రెడిట్ ధృవపత్రాన్ని తండ్రి భాస్కర్ రావుకు అందించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - కొవ్వూరు

అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని మంత్రి తానేటి వనిత అన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మండలంలోని ఐ పంగిడిలో ఆదివారం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల, మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు.

గత ప్రభుత్వాలకు, జగనన్న ప్రభుత్వానికీ తేడాను గమనించాలని కోరారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో 99 శాతం పథకాలను మహిళల పేరుతోనే అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కళా రంగానికి ఆచారి సేవలు చిరస్మరణీయం

సంతాప సభలో పాల్గొన్న పలువురు ప్రముఖులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

దివంగత శృంగారం వెంకట అప్పలాచార్యర్ కళా రంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. ఆదివారం ద్రాక్షారామలో ఏర్పాటు చేసిన ద్రాక్షారామంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో పలువురు ప్రసంగించారు. ద్రాక్షారామ నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో పైడా అన్న సత్రం నాటక కళా పరిషత్ అధ్యక్షులు నాగిరెడ్డి సతీష్ రావు అధ్యక్షతన ఈ సభ నిర్వహించారు. మయూర నాటక కళా పరిషత్ అధ్యక్షులు సత్తి వెంకట రెడ్డి, చింతపల్లి వీరభద్రరావు, మేడిశెట్టి సదాశివదాస్, కోటిపల్లి అబ్బు, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు నరాల రాధాకృష్ణ ముఖ్య అతిథిలుగా పాల్గొని ఆచారి కళలకు కళాకారులకు అదేవిధంగా పత్రికా రంగానికి చేసిన సేవలు గురించి ప్రసంగించారు. తొలుత డా. స్టాలిన్ ఆచారి చిత్రపటానికి, జిల్లా ప్రజా పరిషత్ వైస్ ఛైర్మన్ చింతపల్లి వీరభద్రరావు పెమ్మిరెడ్డి రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సినీ నటి, పరిషత్ కార్యదర్శి వై.సరోజ, ఉపాధ్యక్షులు వై. కొండ, కోశాధికారి వేమవరపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా జిల్లా స్థాయి స్పందన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కలెక్టరేట్‌లో యథావిధిగా అక్టోబర్ 9న సోమవారం జిల్లా స్థాయి స్పందన నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అదేవిధంగా డివిజన్, మునిసిపల్, మండల, గ్రామ వార్డు సచివాలయం పరిధిలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తూన్నందున అక్కడ అర్జీలను ఇవ్వాలని కలెక్టర్ కోరారు.

యానాం వార్తలు

రమాబాయి నగర్‌లో అన్నదానం

ప్రజాశక్తి - యానాం

యానాం మెట్టకూరు రామభాయ్ నగర్‌లో గణపతి నవరాత్రులు ముగింపు సందర్భంగా అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కష్ణారావు సతీమణి ఉదయలక్ష్మి పాల్గొని ఈ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యానాం ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లాడి సామ్యూల్, గుత్తుల రామారావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, నూతన కార్యవర్గ సభ్యులు ముఖ్య ఆతిథులను సత్కరించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులందరికీ అందచేశారు.

అలజడి సృష్టించిన ఆంబోతులు

ప్రజాశక్తి - యానాం

యానాంలో శ్రీ పద్మ సినిమా థియేటర్ ఎదురుగా ఆదివారం సాయంత్రం రెండు ఆంబోతులు అలజడి సృష్టించాయి. ఒకదానిపై ఒకటి దాడి చేసుకునే క్రమంలో ట్రాఫిక్ స్తంభించింది. వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి ఆంబోతులను రోడ్ల మీదకు రాకుండా అరికట్టాలని వాహనాదారులు కోరుతున్నారు.

అంజమ్మ పార్థివ దేహాన్ని అంత్యక్రియలకు తరలిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ తదితరులు

మానవత్వం చాటుకున్న ట్రాఫిక్ ఎస్ఐ

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పోలీసులు అంటే కేవలం కఠినమైన వారుగా మాత్రమే సమాజంలో ప్రజలు భావిస్తూ ఉంటారు. అయితే అది తప్పని సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ నిరూపించారు. ఏ ఆధారమూ లేకుండా బిక్షాటన చేసుకుంటూ అనారోగ్యానికి గురై మతి చెందిన ఆవుల అంజమ్మ (38) పార్థివదేహం పట్ల ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు మానవత్వాన్ని చాటిచెప్పారు. ఆమె మృతదేహానికి అంత్యక్రియలను సొంత ఖర్చులతో చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. సామర్లకోటలోని భీమేశ్వర ఆలయం, రైల్వే స్టేషన్, తదితర ప్రాంతాల్లో అంజమ్మ, ఆమె భర్త ఆవుల పాలయ్యలు భిక్షాటన చేసుకుంటూ జీవనాన్ని కొనసాగించేవారు. అయితే ఇటీవల అంజమ్మకు ఒక బిడ్డ జన్మించి మృతి చెందింది. తదుపరి ఆమె అనారోగ్యానికి గురైంది. ఆమె వైద్యానికి ఎలాంటి సహకారం అందకపోవడంతో ఆమె ఆరోగ్యం క్షీణించడంతో ఆదివారం ఉదయం రైల్వే స్టేషన్ సమీపంలో మృతి చెందింది. భర్త ఏమీ చేయలేని స్థితిలో ఉండగా సాయంత్రం వరకు మృతదేహం అలానే ఉండిపోవడంతో స్థానికులు సమాచారంతో ట్రాఫిక్ ఎస్ఐ గరగరావు మానవతాదృక్పథంతో మృతదేహానికి సొంత ఖర్చులతో అంత్యక్రియలు జరిపించారు. కేవలం శాంతి భద్రతల పరిరక్షణ కోసం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు మాత్రమే పరిమితం కాకుండా ఇలా సమాజ సేవలోనూ పోలీస్ సిబ్బంది ముందుండటాన్ని పలువురు అభినందించారు.

గొల్లవిల్లి ఆర్ అండ్ బి ప్రధాన రహదారిని ఆనుకుని హై టెన్షన్ విద్యుత్ స్తంభాలుపై పాదులు

విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న పాదులు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్ స్తంభాలకు తీగలకు పాదులు అల్లుకుని స్తంభాల పైకి విద్యుత్ తీగలపైకి ఎగబాకాయి. దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఏదో ఒకచోట ఈ దృశ్యాలు కనిపిస్తున్నాయి. ప్రధాన రహదారుల వెంబడి హై టెన్షన్ విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న పాదుల దృశ్యాలు కనిపిస్తున్నా కనీసం విద్యుత్ శాఖ అధికారులు కాని ప్రజా ప్రతినిధులు కాని పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు విమర్శిస్తున్నారు.

వర్షాకాలంలో పశువులు, చిన్నపిల్లలు పొరపాటున విద్యుత్ స్తంభాలకు పాదులకు తగిలితే విద్యుత్ షాక్ కు గురయ్యే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. ఇలా స్తంభాలకు తీగలకు పాదుల వేలాడుతూ తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నా పట్టించుకోవడం లేదని విద్యుత్ వినియోగదారులు ఆరోపిస్తున్నారు. గాలి, వర్షం వస్తే ఈ సమస్యల వల్ల గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా ట్రీ కటింగ్ అంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు అధికారికంగా విద్యుత్ సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేస్తున్న విద్యుత్ శాఖకు ఇవి కనిపించడం లేదా అని మండిపడుతున్నారు. ఇటువంటి సమస్యల వల్ల విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడిన తర్వాత గంటల తరబడి విద్యుత్ శాఖ సిబ్బంది మరమ్మత్తులు చేసి వినియోగదారులను ఇబ్బందులకు గురి చేయడం కంటే ముందుగానే వీటిని గుర్తించి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

సాటిలైట్ సిటి విద్యార్థులకు ఇస్రో ఆహ్వానం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల భాగంగా ఇస్రో నిర్వహించిన కార్యక్రమంలో శాటిలైట్ సిటీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి ఇస్రో శాస్త్రవేత్తల మన్ననలు పొందారు. సైన్స్ ప్రాజెక్ట్ పోటీల్లో సాటిలైట్ సిటీ విద్యార్థులు ప్రదర్శించిన చంద్రయాన్ 3 ప్రాజెక్ట్ బహుమతి పొందింది. ఇస్రో జనరల్ మేనేజర్ సైంటిస్ట్ విజయ్ కుమార్ విద్యార్థులను పరీక్షించి వారి ప్రాజెక్టులను విశ్లేషించి తగిన సూచనలు సలహాలు అందజేశారు. ప్రాజెక్టు రూపకల్పనలో విద్యార్థుల ప్రతిభను మెచ్చుకున్నారు. ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ సునీల్ కుమార్ విద్యార్థులను అభినందించి మెమెంటో సర్టిఫికెట్ అందజేశారు. ఈ విద్యార్థులు ఇస్రోను ఎప్పుడైనా సందర్శించవచ్చని వారికి అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ప్రోత్సహించిన సర్వేశ్వరరావు, రాజారావు, ఉపాధ్యాయిని మేకా సుసత్య రేఖ, సాటిలైట్ సిటీ ప్రధానోపాధ్యాయిని బి.రాజరాజేశ్వరిని అభినందించారు. శాటిలైట్ సిటీ హైస్కూల్ విద్యార్థులను జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.అబ్రహాం, రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యా శాఖాధికారి ఈరంకి నారాయణ, రూరల్ ఎంఇఒ అయ్యంకి దుర్గా తులసీదాస్ అభినందించారు.

విద్యార్థులకు మెమెంటోలు అందజేసిన దృశ్యం

ఎస్‌కెవిటి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అంతరిక్ష వారోత్సవాల్లో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుని ఇస్రో మెరిట్ సర్టిఫికెట్స్ సాధించారని పాఠశాల హెచ్ఎం ఎంవిఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ పోటీల్లో పదో తరగతి విద్యార్థి నూలు హేమంత్ కుమార్ ప్రథమ బహుమతి, 9వ తరగతి విద్యార్థిని కెవి కావ్యశ్రీ తతీయ బహుమతి, క్విజ్ పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని కావ్య అమత తతీయ బహుమతిని పొందినట్లు ఆయన తెలిపారు. విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందచేశారు. విద్యార్థులను ప్రోత్సహించిన డ్రాయింగ్ ఉపాధ్యాయులు డాక్టర్ పుప్పాల బాపిరాజుని డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఇవివిఎస్ఎన్.నారాయణ, అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్ కుమార్, రూరల్ ఎంఇఒ అయ్యంకి దుర్గా తులసీదాస్ అభినందించారు.

విద్యార్థిన్ని అభినందిస్తున్న అర్బన్ రేంజ్ డిఐ దిలీప్‌కుమార్ తదితరులు

ఇస్రో ఉద్యోగాల కోసం కెరీర్ గైడెన్స్ ఉండాలి

-పాఠ్యాంశాల్లో అంతరిక్ష విజ్ఞానం చేర్చాలి

-ఘనంగా ముగిసిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఇస్రో ఉద్యోగాల్లో చేరడానికి అనువుగా కెరీర్ గైడెన్స్ రూపొందించడంతోపాటు అంతరిక్ష విజ్ఞానం గురించి విస్తృతంగా పాఠ్యాంశాల్లో చేర్చాలని జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ అభిప్రాయపడ్డారు. ఆ దిశగా ఇస్రో కృషి చేస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ నెల 6వ తేదీ నుంచి స్థానిక శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో నిర్వహిస్తున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ఆదివారం సాయంత్రంతో ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు వేడుకల్లో తేజ్ భరత్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో సౌకర్యవంతమైన జీవనం సాగిస్తున్నామంటే అందుకు ఇస్రో పరిశోధనలు, ప్రయోగాలు కారణమన్నారు. ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్, టివి, జాతీయ విపత్తుల గురించి ముందుగా తెలుసుకోవడం వంటివన్నీ ఇస్రో పరిశోధనల ఫలితమేనని వివరించారు. అంతరిక్షంలో అగ్రగామిగా ఉంటేనే భవిష్యత్తులో సూపర్ పవర్‌గా ఎదగవచ్చని తెలిపారు. అందుకే చైనా, రష్యా, అమెరికా వంటి దేశాలతో ఇస్రో పోటీ పడుతోందన్నారు. రాజమహేంద్రవరంలో అంతరిక్ష వారోత్సవాలు విజవంతం చేయడంలో కృషి చేసిన అందరికీ ఆయన అభినందనలు తెలిపారు. ఎస్‌పి జగదీశ్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్ శాస్త్రవేత్తలుగా ఎదగాలని, చంద్రయాన్, ఆదిత్య ఎల్1 వంటి ప్రయోగాలతో ఇస్రో అద్భుత విజయాలను నమోదు చేసిందన్నారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను రాజమహేంద్రవరంలో నిర్వహించి స్కూల్ విద్యార్థులను ఆహ్వానించి అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. శ్రీహరికోట షార్ డిప్యూటీ డైరెక్టర్ పి.సునీల్ మాట్లాడుతూ గడిచిన 60 ఏళ్లలో ఎన్నోప్రయోగాలు చేసి విజయాలను నమోదు చేసున్న ఇస్రో భవిష్యత్తులో హ్యూమన్ మిషన్, గగన్ యాన్, చంద్రయాన్ 4, 5, 6 వంటివి ప్రయోగించాల్సి ఉందని, అందుకే భవిష్యత్ తరాలకు అంతరిక్ష విజ్ఞానాన్ని చేరువ చేస్తున్నామన్నారు. కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆర్జేడీ సిహెచ్.కృష్ణ మాట్లాడుతూ ఇస్రో సాధిస్తున్న విజయాలను వివరిస్తూ భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు నమోదు చేసుకోవాలన్నారు. శ్రీహరికోట షార్ ఎల్ఎస్ఎస్ఎఫ్ జనరల్ మేనేజర్, ఉత్సవాల ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ ఎన్. విజయకుమార్ స్వాగతోపన్యాసం చేస్తూ, ఈ మూడు రోజుల్లో దాదాపు 25 వేలమందికి పైగా విద్యార్థులు సందర్శించారని చెప్పారు. స్పేస్ వాక్ మొదలుకుని ఉత్సవాల నిర్వహణకు సహకరించిన ప్రతిఒక్కరికీ అయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ నారాయణ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ దిలీప్ కుమార్, రాజమహేంద్రి విద్యా సంస్థల అధినేత టికె విశ్వేశ్వర రెడ్డి, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ అధినేత బాలాత్రిపుర సుందరి, అక్షర శ్రీ స్కూల్ డైరెక్టర్ టి నాగరత్నం, ప్రయివేట్ స్కూల్స్ మేనేజ్ మెంట్స్ అసోసియేషన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

నృత్యప్రదర్శన

కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

మహారాజశ్రీ 10వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు మరియు SC, ST కోర్టు, రాజమహేంద్రవరం
I.A.No. 114/2021 in O.S.No. 56/2018
Between:
Nekkanti Veeraju ...Petitioner/Plaintiff
AND
Katta Raghu Prasad and Others ...Respondents
12. Katta Anuradha, W/o. late Raghu Prasad, Hindu, aged 59 years, House wife, D.No. 75-7-7, Round Park, Prakash Nagar, Rajamahendravaram. ...12th Respondent/ Defendant
పై నంబరు పిటిషన్‌లో 12వ రెస్పాండెంటు/ డిఫెండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయు చున్నారు. కావున ది. 18-10-2023 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి 08-10-23
ఎం.నవీన్‌కుమార్ అడ్వకేట్, రాజమండ్రి సెల్: 98484 13708

మహారాజశ్రీ 5వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టు రాజమహేంద్రవరం
O.S.No. 816/2020
Between:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, R.A.S.M.E.C.C. & S.A.R.C., దానవాయిపేట, రాజమండ్రి, రిప్రజెంటెడ్ బై ఇట్స్ మేనేజర్, S.A.R.C. Wing., ...వాది
మరియు
గాదె వీరవెంకట రామసూర్య ప్రభుకృష్ణ ప్రసాద్, తండ్రి: వీర సుబ్రహ్మణ్యం, హిందువు, వయస్సు 36, బిజినెస్, R/o. డో.నెం. 3-2/143, స్పిన్నింగ్ మిల్లు కాలనీ, నెం.2, లాలాచెరువు, రాజమహేంద్రవరం. ...ప్రతివాది
పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు /నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది. 13-10-2023 సం॥రం తేదీన వాయిదా వేసినారు. సదరు తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరు అయ్యి పై దావాలో మీ ఆక్షేపణలను ఉన్నచో తెలుపు కొనవలెను. లేని ఎడల సదరు దావా మీ పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కె.వి.వి.ఎస్.నారాయణస్వామి
రాజమండ్రి, 08-10-23.
కె.ఇందిర, అడ్వకేట్స్, రాజమండ్రి.